
# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక



THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు- మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంధాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగి నప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియ జేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Editor : J. C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 9 ఫిబ్రవరి 1989 సంచిక 7


## సంపాదకీయము

### క్రీస్తుద్వారా దేవుని విమోచన మార్గము

### (God's Plan of Redemption thro' Christ)

మానవుడు స్వాభావికముగా పాపియై యున్నాడు. అతడు పాపమునకు బానిస అయిపోయి వున్నాడు. అతడు దానికి బానిస గనుక తనకు తానే విడుదల పొందలేని స్థితిలో యున్నాడు. దేవుని న్యాయ చట్టప్రకారం అతడు మరణించుటకు శపించబడిన వాడై యున్నాడు. దేవుడు విధించు ఈ శిక్ష బహు న్యాయమైనది. దేవుడే దానిని విధించెను గనుక అది న్యాయమైనది.

### దేవుని ప్రేమ

అయితే దేవుడు మానవుని యెడల ప్రేమ కలిగినవాడై యున్నాడు. ఆయన ప్రేమ బహు లోతైనది. మానవుడు పాపము వలన మరణించుటకు సిద్ధముగా యుంటే దేవుడు అతని యెడల జాలి కలిగినవాడై యున్నాడు. ఆయన సృష్టించిన మనుష్యుల పట్ల ఆయన

కరుణ కలిగినవాడై యున్నాడు. అందువలన మానవుడు మరణించకుండా, పాపపు శిక్షనుండి తొలగించబడుటకు దేవుడే ఒక మార్గమును అతని కొరకు నెలకొల్పెను. అది యేసుక్రీస్తుద్వారా ఆయన మానవుల కిచ్చిన విమోచన మార్గము. ఈరోజు మనం ఆ విమోచన మార్గమును గూర్చి కొంత తెలిసికొందాం.

## ఆదిలోనే తెలియజేసెను

మానవుని విమోచించు నిమిత్తము ఆయన జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమచేత క్రీస్తులో నిర్ణయించుకొనెను (ఎఫెసీ 1:4). ఆదాము హవ్వలు పాపములో బడగానే, వారిని విమోచించు మార్గమును దేవుడు వారికే తెలియపరచెను. ఆయన సర్పమును శపించుచు, "మరియు నీకును స్త్రీకిని, నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును నీవు దానిని మడిమమీద కొట్టుదువని" చెప్పెను (ఆది 3:17). సాతానుయొక్క బలమును, అంటే మరణమును జయించిన వాడే యేసుక్రీస్తు. ఆయన కన్యయైన మరియకు జన్మించిన స్త్రీ సంతానము.

అబ్రాహాముకు దేవుడు ఈ విమోచన మార్గమును బయలుపరచెను: "మరియు నీవు నా మాట వినినందున భూలోకములోని జనములన్నియు నీ సంతానమువలన ఆశీర్వదించపడును" అని యెహోవా అబ్రాహాముకు ప్రమాణము చేసెను (ఆది 22:18). "ఆయన అనేకులను గూర్చి అన్నట్టు—సంతానములకును అని చెప్పక ఒకని గూర్చి అన్నట్టే—నీ సంతానమునకు అనెను; ఆ సంతానము క్రీస్తు" (గలతీ 3:16).

## ప్రవక్తలద్వారా ప్రకటించెను

ప్రవక్తలద్వారా దేవుడు తన విమోచన మార్గాన్ని ప్రజలకు తెలియపరచెను. యెషయా ప్రవక్త ఇట్లు చెప్పుచున్నాడు: "కాబట్టి ప్రభువు తానే యొక సూచనను మీకు చూపును. ఆలకించుడి

కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును" (యెషయా 7:14). "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజముమీద రాజ్య భారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు అధిపతియని అతనికి పేరు పెట్టబడును" (యెష 9:6) అని ప్రవక్తలు ప్రవచించిరి.

దేవుడు పంపించబోవు విమోచనకర్తను గూర్చి చెప్పబడిన ఈ సంగతులన్నియు యేసుక్రీస్తు యొక్క రాకడయందు నెరవేరినవి.

క్రీస్తు ఈ లోకములో జన్మించగానే ఆయనే లోకరక్షకుడు అని చాటించబడెను. గొర్రెల కాపరులు పొలములో ఉండి తమ మందను కాచుకొనుచుండగా ప్రభువు దూత - "భయపడకుడి; ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహాసంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను; దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు" అని వారికి చెప్పెను.

## యేసే రక్షకుడు

యేసుక్రీస్తు చేసిన బోధలనుబట్టి ఆయనే రక్షకుడు అని మనం గ్రహించగలము. ఇదిగో ఈయనే లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల అని యేసునుగూర్చి యోహాను సాక్ష్య మిచ్చెను. "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. లోకము తన కుమారునిద్వారా రక్షణ పొందుటకేగాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవు డాయనను లోకములోనికి పంపలేదు". "నా మాట విని నన్ను పంపినవానియందు విశ్వాసముంచు వాడు నిత్యజీవము గలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములోనుండి జీవములోనికి దాటి

యున్నాడు." "లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు. అవే నన్నుగూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి." "పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచు వాడు చనిపోయినను బ్రదుకును; బ్రతికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు." "నేను లోకమునకు తీర్పు తీర్చుటకు రాలేదుగాని లోకమును రక్షించుటకే వచ్చితిని" యని యేసు బోధించెను (యోహాను 3:16, 17; 5:24, 39-40; 11:25, 26; 12:47). గనుక ఆయన చేసిన గంభీరమైన బోధలనుబట్టి కూడా మనం ఆయనే రక్షకుడు అని గ్రహించగలము.

యేసుక్రీస్తుయొక్క మరణముద్వారా ఆయన రక్షకుడు అని మనకు విశదీకరింపబడినది. ఆయన తన రక్తము నుద్దేశించి, "ఇది నా రక్తము అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" అని చెప్పెను. "యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును, పాపక్షమాపణయు ప్రకటింపబడునని వ్రాయబడియున్నది." "నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు; మంచివానికొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింపవచ్చును. అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మన మింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయనద్వారా ఉగ్రతనుండి రక్షింపబడుదుము" (మత్తయి 26:28; లూకా 24:47; రోమా 5:8, 9).

యేసుక్రీస్తు ప్రవచింపబడిన రీతిగ ఒక కన్యకు జన్మించెను. ఆయన నీతిని బోధించెను. ఏ పాపము లేకయే పాపముకొరకై మరణించెను. లేఖనముల ప్రకారము ఆయన సమాధిని జయించి తిరిగి లేచెను. గనుక దేవుని కుమారుడని, లోకరక్షకుడు అని ఆయన

మహిమా ప్రభావములతో నిరూపింపబడెను. విమోచనకర్తను అనుగ్రహించెదను అని దేవుడు చేసిన వాగ్దానముల నన్నిటిని యేసుక్రీస్తు నెరవేర్చి, ఆయనే విమోచనకర్తయని నిరూపించుకొనెను. అందువలన క్రీస్తు యేసుద్వారా మనము మనకు సంభవింపబోవు ఉగ్రతనుండి తప్పించుకొను మార్గమును దేవుడు బయలుపరచెను. కనుక మానవునికి మేలు సంభవించెను.

## క్రీస్తు మన శిక్షను భరించెను

దేవుని ధర్మశాస్త్రము పరిశుద్ధమైనది. దానికి వ్యతిరేకముగా ప్రవర్తించు వానిని అది శిక్షించును. "ఎవడైనను ధర్మశాస్త్ర మంతయును గైకొని, ఒక ఆజ్ఞ విషయములో తప్పిపోయిన యెడల, ఆజ్ఞలన్నిటి విషయములలో అపరాధి యగును" (యాకోబు 2:10). దేవుడు యదార్థవంతుడు కనుక ఆయన చట్టము నుల్లంఘించినవారిని ఆయన సహింపజాలడు. అట్లయిన ప్రతి మనుష్యుడు కూడ శిక్షింపబడవలెను గదా. ఆ శిక్ష మరణమేగదా. అయితే దేవుడు మానవుని ప్రేమించుచున్నాడు. మానవుడు పాపమువలన వచ్చు శిక్షనుండి తప్పించబడవలెనంటే అతనికి బదులుగా మరియొకడు ఆ శిక్షను భరించవలసియున్నది. అవును యేసుప్రభువునే దేవుడు మనకు బదులుగా మనందరి పాపముల నిమిత్తమై శిక్షించెను. "మన యతిక్రమ క్రియలనుబట్టి ఆయన గాయపరచబడెను. మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష ఆయనమీద పడెను". ఏలయనగా మరణము నొందునట్లు అతడు తన ప్రాణమును ధారపోసెను. అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెను. అనేకుల పాపమును భరించుచు తిరుగుబాటు చేసినవారిని గూర్చి విజ్ఞాపనము చేసెను" (యెషయా 53:5; 12). "ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" (2 కొరింథి 5:21).

నిజానికి మన ఒక్కొక్కనిపై రావలసిన మరణశిక్షను యేసుక్రీస్తు తన సిలువలో మనందరికొరకు భరించెను. దేవుని కృపవలన ప్రతి మనుష్యుని కొరకు ఆయన మరణము ననుభవించి దేవుని ప్రేమను, కృపను మనయెడల వ్యక్తపరచెను.

దేవుడు పాపమును ద్వేషించి, పాపిని ప్రేమించుచున్నాడు. అందువలన నశించుచున్న ఈ పాపిని ఆయన రక్షించవలెనని కోరుచున్నాడు. దేవుడు యదార్థవంతుడు. అందువలన ఆయన పాపిని నీతిమంతునిగా ఎంచుచూ తన యథార్థతను నెరవేర్చు విధానమును కనుగొనెను. మనందరి పాపముల నిమిత్తమై యేసుక్రీస్తును బలియిచ్చి ఆయన మరణ పునరుత్థానములద్వారా మనలను నీతిమంతులనుగా ఎంచుటకు ఆయన నిశ్చయించుకొనెను. దేవునియెదుట పాపులమైన మనము నీతిమంతులముగా తీర్చబడవలెనంటే, యేసుక్రీస్తునందు విశ్వాసముంచి, మనకు బదులుగా ఆయన అర్పించబడెను అని మనము అంగీకరించవలెను.

యేసుక్రీస్తుకు మనయెడల ఉన్న ప్రేమ, కరుణ, కటాక్షములు గొప్పవి అందువలననే ఆయన దేవుడై యుండియు నరావతారుడై మనలను రక్షించుటకు ఈ లోకమునకు వచ్చెను. నరావతారుడై యుండియు ఏ పాపమును చేయకుండగ పరిపూర్ణ జీవితమును జీవించెను. అందువలన పాపమునకు విరుగుడుగా పరిపూర్ణ బలియాగముగా తన్ను తాను అర్పించుకొనగలిగెను. భక్తుడైన పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "క్రీస్తు యేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని, మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్య

7

నిగా కనబడి, మరణము పొందునంతగా అనగా సిలువమరణము పొందు నంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:5-8).

యేసు మరణించి పునరుత్థానుడై లేచుటతో దేవుడు మనయెడల ఏర్పరచిన విమోచన కార్యక్రమము సంపూర్ణమాయెను. క్రీస్తు తిరిగి లేవనియెడల మనము సమాధి యనంతరము నిరీక్షణలేనివార మగుదుము. "ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతుల లోనుండి లేపబడి యున్నాడు. మనుష్యునిద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను; ఆదాము నందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింప బడుదురు" (2 కొరింథి 15:20-22).

## అయనకు లోబడాలి

మనము యేసునుగూర్చి గాని, ఆయన క్షమాపణమార్గమును గూర్చిగాని వినలేనియెడల దేవుడు మనయెడల చూపిన కృప వ్యర్థ మగును. మనము పాపమునుండి విమోచన పొందవలెనంటే యేసు క్రీస్తు ఆజ్ఞలను గైకొనవలెను. "నన్ను నిరాకరించి నామాటలను అంగీకరింపనివానికి తీర్పు తీర్చువాడొకడు కలడు. నేను చెప్పిన మాటయే అంత్యదినమందు అతనికి తీర్పు తీర్చును" అని యేసు చెప్పెను (యోహాను 12:48). ఆయన యేమి చెప్పుచున్నాడు? యేసు దేవుని కుమారుడు అని నమ్మవలెనని చెప్పుచున్నాడు. మనం చేసిన పాపముల నిమిత్తము మారు మనస్సు పొందవలెనని చెప్పుచున్నాడు. ఆయన నామమును మనుష్యులయెదుట ఒప్పుకొని, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము అని చెప్పుచున్నాడు. మీరు యేసు మాటలను విని ఆయన చెప్పు రీతిగ చేయుదురని నా అభిలాష, నా ప్రార్థనను.

# సువార్త
## (The Gospel)

సువార్త అనగా మంచివార్త అని అంటారు. సాధారణంగా మంచివార్త ఒక దాన్ని మించి మరొకటి ఉంటుంది గాని బైబిలులో కనబడే ఈ సువార్త ఏకైక సువార్త. ఇంతకంటె వేరే సువార్త లోకములో లేదు. అది క్రీస్తు సువార్త (1 కొరి 9:12, 2 కొరి 9:12-15, 10 : 14; గల 1 : 7).

"లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను. సమాధి చేయబడెను. మరియు లేఖనముల ప్రకారము మూడవ దినమున లేచెను." ఇందునుబట్టి క్రీస్తు సువార్త అనగా క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానము అని అర్థము. అవును, మరణము సమాధిని గెలిచి లేచినది క్రీస్తునందు మాత్రం తప్ప ఇక లోకమందు ఎవరివలనను జరుగలేదు.

అయితే క్రీస్తు మరణ సమాధి పునరుత్థానమైన ఈ క్రియ వర్తమానము "సువార్త" ఎట్లు అయింది? ఇదే గొప్ప మర్మము.

సర్వకాల, సర్వలోక పాపులకు రక్షణ కలుగు నిమిత్తము క్రీస్తు శిలువ మరణము పొంది, పాపులను రక్షించు శక్తి మరణమును జయించి మూడవ దినమున సమాధినుండి లేచుట వలన నిరూపించెను. నమ్ము ప్రతి వానికి రక్షణ కలుగజేయుటకు "సువార్త" దేవుని శక్తియై యున్నది.

పాపులను రక్షించు ఈ సువార్త పాప మానవులు ఎట్లు తెలిసికొనగలరు?

దేవుడు దర్శనము ద్వారా సువార్తను పాపికి తెలియజేయునా? కాదు. క్రీస్తు ఆకాశమునుండి సువార్త స్వరము వినిపింపజేయునా?

అది ఎంతమాత్రం కాదు. దేవదూతలవలన సువార్త తెలుపబడుచున్నదా? అలాగు దేవుడు నియమించినట్లు క్రీస్తు బోధయందు ఎక్కడను వ్రాయబడి యుండలేదు. అలాగు దర్శనములో స్వరము విన్నాను దర్శనముద్వారా నేను రక్షింపబడ్డాను అని చెప్పేవారు ఎంతటివారైనను వచ్చి అబద్ధికులును, మోసగాండ్రైన పనివారునై యున్నారు. అట్లైన సువార్త ఎట్లు తెలుపబడుచున్నది?

"సువార్త ప్రకటన యను వెర్రితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను" (1 కొరి 1:21). లోకమునకు వెర్రితనముగా నున్న ఈ సువార్త ఎవరు ప్రకటింతురు? "అయ్యో నేను సువార్త ప్రకటింపక పోయినయెడల నాకు శ్రమ" "సువార్తను ప్రకటింపవలసిన భారము నా మీద మోపబడియున్నది" (1 కొరి 9:16).

"రోమాలోని మీకు సువార్తను ప్రకటించుటకు నేను సిద్ధముగా ఉన్నాను. సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను" (రోమా 1:16). "మొదటి దినమునుండి ఇదివరకు సువార్త విషయములో మీరు నాతో పాలివారై యుండుట చూచి మీలో ఈ సత్క్రియ నారంభించినవాడు యేసుక్రీస్తు దినమువరకు దానిని కొనసాగించునని దృఢిగా నమ్ముచున్నాను". "నా బంధకములయందును, నేను సువార్త పక్షమున వాదించుట యందును దాని స్థిరపరచుటయందును, మీరందరు ఈ కృపలో నాతోకూడ పాలివారై యున్నారు గనుక నేను మిమ్మును నా హృదయములో ఉంచుకొని యున్నాను" (ఫిలి 1:3-7).

"మీరును సత్యవాక్యమును అనగా మీ రక్షణ సువార్తను విని క్రీస్తునందు విశ్వాసముంచి..." (ఎఫె 1:13). సువార్తలో పాపులను రక్షించు శక్తి ఉన్నది. సువార్తను నమ్ము ప్రతి వానిని రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది (రోమా 1:16). పై వచనము

లనుబట్టి పాపులు రక్షింపబడు నిమిత్తము క్రీస్తు సువార్త ప్రకటింపబడవలెననియు, సత్యవాక్యము అనగా రక్షణ సువార్త ప్రకటించు బాధ్యతను మానవులకు అప్పగించెననియు తెలియుచున్నది.

అందుచే మానవులైన అపొస్తలులు ఇట్లు చెప్పుచున్నారు, "మీరీలాగు రక్షింపబడి మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహిమను పొందవలెనని ఆయన సువార్త వలన మిమ్మును పిలిచెను" (2 థెస్స 2:14). "...ఇప్పుడు మన రక్షకుడైన దేవుని ఆజ్ఞ ప్రకారము నాకు అప్పగింపబడిన సువార్త ప్రకటనవలన తన వాక్యమును యుక్తకాలములయందు బయలుపరచెను" (తీతు 1:1-4). "ఆ సమాధాన వాక్యము మాకు అప్పగించెను" (2 కొరి 5:18-19).

పాపులు రక్షింపబడుటకు అపొస్తలులు ప్రకటించిన క్రీస్తు సువార్త ఇపుడు మనమును ప్రకటింపవలెను. మొదటి శతాబ్దములోని పాపులను రక్షించు శక్తిగల క్రీస్తు సువార్త నేటికిని పాపులను రక్షించు శక్తిని కలిగియున్నది. అట్లు పాపులను రక్షించుట దేవుని దయగల సంకల్పము. పాపులను రక్షించు దేవుని శక్తి గల సువార్తను మనము క్రొత్త నిబంధన లేఖనములనుండి మాత్రము పొందవలెను, నమ్మవలెను బోధింపవలెను. ఇది పరిశుద్ధాత్ముడు సంఘమునకు అపొస్తలుల ద్వారా ఇచ్చిన ఆజ్ఞ. ప్రభువైన యేసుక్రీస్తు అపొస్తలులకు చెప్పిన సంగతి (మత్త 28:20; 2 కొరి 1:13, 18, 19).

అందువలననే అపొస్తలుని ప్రసంగము విని పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందినవారు అనగా రక్షింపబడిన ఆ మొదటి జనము అదే పెంతెకొస్తను పండుగ దినమున క్రీస్తు స్థాపించిన తన సంఘము. ఆ దినమునుండి అపొస్తలుల బోధయందు ఎడతెగక యుండిరి. అపొస్తలులు ప్రకటించిన సువార్త గాక మరియొక సువార్త మరలా అపొస్తలులే ప్రకటించినను, పరలోకమునుండి దిగివచ్చిన

యొక దూతయైనను ప్రకటించిన యెడల వాడును వాని బోధవిన్న వారును శాపగ్రస్తులై యున్నారు అని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు (గల 1:6-9).

అయితే అపొస్తలుల తరువాత పరిశుద్ధాత్మ చెప్పినట్లు క్రూరమైన తోడేళ్లవంటి దుర్బోధకులు సంఘములోనుండియే లేచి వంకర మాటలు పలుకుచు క్రైస్తవులలో నుండి కొందరిని తమవెంట ఈడ్చుకొనిపోవుచూ భిన్నమైన సువార్తను సృష్టించి భిన్నమైన సంఘములను స్థాపించుకొనిరి (అ.కా. 20:28-30).

అవే నేడు మనముందున్న విస్తారమైన వివిధ పేరులు కలిగి కనబడే సంఘాలు, విభిన్న సిద్ధాంతాలుగల సంస్థలు. ఒకదాని తరువాత ఒకటి ఒకదానికి మించి ఒకటి తమ నాయకత్వాన్ని నిలుపుకొంటూ పోటీపడుచున్నట్లు మన కళ్ళముందు తేటగా ఉన్నవి.

అవి తాము పెట్టుకొని పిలువబడే పేరులు పరిశుద్ధాత్ముడు సంఘముకొరకు ఇచ్చిన పేర్లు కాదని మనము గ్రహించగలము. ఏలయనగా అపొస్తలుల లేఖనములందు సంఘముకొరకు అవి వ్రాయబడలేదు. క్రీస్తు సువార్తకు భిన్నమైన సువార్తకు గల భేదమును ఈ దిగువ రీతిని చూడండి.

క్రీస్తు సువార్త: "పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెను" (1 తిమో 1:15). పాపుల రక్షణకొరకు క్రీస్తు ఏమిచేసెను? శిలువలో బలియై చనిపోయి సమాధి చేయబడి మూడవ దినమున సమాధినుండి తిరిగి లేచెను. పాపులను రక్షించుటకు క్రీస్తు చేసిన యాగములోగల క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానము వలన కలుగు రక్షణను పాపులు ఎట్లు పొందగలరు?

క్రీస్తు సువార్తను పై రీతిని విని విశ్వసించి మారుమనస్సుపొంది,

యేసుక్రీస్తు దేవుని కుమారుడని నోటితో ఒప్పుకొని, పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందవలెను.

## నీటిలో బాప్తిస్మము

బాప్తిస్మము క్రీస్తు మరణము లోనికి నడిపించును. బాప్తిస్మము క్రీస్తు సమాధిలో పాలిపెట్టుటలోనికి నడిపించును. మరియు బాప్తిస్మము క్రీస్తు పునరుత్థానములోనికి నడిపించును. పాపులు బాప్తిస్మము అను క్రియను చేయుటద్వారా క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానములతో సంయుక్తులుగా చేయబడుచున్నారు (రోమా 6 : 3-5).

అందువలన నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును (మార్కు 16:15). పాప క్షమాపణ కొరకు బాప్తిస్మ పొందుడి (అ.కా. 2:38). బాప్తిస్మము పొంది నీ పాపములు కడిగివేసుకొనుము (అ. కా. 22:16). బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది (1 పేతు 3:21). బాప్తిస్మము అనగా క్రీస్తు మరణ సమాధి పునరుత్థానము. క్రీస్తు మరణ సమాధి పునరుత్థానము అనగా క్రీస్తు సువార్త. క్రీస్తు సువార్తకు లోబడుట యనగా బాప్తిస్మము పొందుట. ఇది పాపులు రక్షణ పొందుటకు క్రీస్తు సువార్తానుసారమైన ఉపదేశక్రమము (రోమా. 6:17).

## అయితే భిన్నమయిన సువార్త (గల 1:6-9)

ఎట్లున్నది? కొందరి బోధ:-"పాపములు ఒప్పుకొని ప్రార్థించుచుండగా వెలుగు కనబడెను. వెలుగులో శిలువలో వ్రేలాడుచున్న క్రీస్తు కనబడెను. అపుడు స్వరము వినబడెను నా కుమారుడా నీ పాపములు క్షమించితిని సమాధానముతో అపుడే నాలోనుండి పాపభారము పోయెను.

పాపములు ఒప్పుకొంటూ ప్రార్థించుచుండగా యెషయా 41:8-10 వచనములు దర్శనములో చూపించెను. ఆ వాక్యములు నా చెవులకు వినిపించెను. వెంటనే నాలోనుండి పెద్దపెద్ద పాపపు మాటలు దొర్లిపోయెను. అపుడు నా హృదయభారము పోయి గొప్ప సంతోషము కలిగెను. దర్శనములో యెష 1:18 చూపించి నన్ను రక్షించెను."

ఈలాగు పాపులు రక్షింపబడవలెనని క్రీస్తు నిర్ణయించినట్లు క్రీస్తు సువార్తలో వ్రాయబడలేదు. అసలు ఈలాగు రక్షింపబడినట్లు వీరు ఇచ్చే సాక్ష్యాలు కేవలము భిన్నమైన సువార్త మాత్రమే. ఇట్లు క్రీస్తు సువార్తలో లేదు.

అందువలన పరిశుద్ధాత్ముడు ముందుగా అపొస్తలులకు ఇట్లు బయలు పరచెను. మేము మీకు ప్రకటించిన సువార్త గాక మరి యొకటి పరలోకమునుండి వచ్చిన ఒక దూత వచ్చి చెప్పినను నమ్మకుడి. అట్టి వాటిని నమ్మినవారు శాపగ్రస్తులగుదురు (గల 1:6-9).

ఇట్లు మీరు భిన్నమైన సువార్తకును క్రీస్తు సువార్తకును గల భేదాను లేఖనములతో పోల్చుకొనిన కొలతల సులువుగా గ్రహింతురు. క్రీస్తుసువార్తకు విధేయులైనారా? భిన్నమైన సువార్త వలన మీరు మోసపోకూడదని నా కోరిక. —పాల్ గూటం, గొల్లవిల్లి.

---

## జీవితము విలువైనదా ?

### (Is Life worth Living?)

జీవితము విలువైనదా? కొందరు కాదని నిశ్చయించుకొని తమకు తాముగా నాశనమును కొని తెచ్చుకొందురు. కానీ దేవుడు జీవితమనేది ఎంతో విలువైన దానిగా చెప్పుచున్నాడు.

విలువైన జీవితాన్ని ఎవ్వరూ కలిగి యుండలేరు గానీ జీవితమును విలువైనదానిగా మార్చుకొనవచ్చును. జీవితాన్ని జీవించవలెనే గాని దుఃఖకరముగా చేసికొనకూడదు. జీవించటం అనేది ఒక కళ. ఈ కళను క్షుణ్ణంగా అభ్యసించిన వారు చిత్రకారులకంటే, లేదా శిల్పకారులకంటే గొప్పవారుగా కనబడతారు. జీవించడానికి, ఏదో ఒక రకంగా బ్రతికి ఉండటానికి చాలా వ్యత్యాసము గలదు. నీ జీవితం అనేది కేవలం నీవు మలచుకొనే విధానం మీద ఆధారపడి యున్నది. దేవుని వాక్యము సంతోషకరమైన మరియు జయకరమైన జీవితంలోని మర్మాన్ని తెలియజేస్తుంది. అది మనలో ప్రతి ఒక్కరు నేర్చుకొనదగిన కళ. కానీ దానిని నేర్చుకొనుటకు కొంత సమయాన్ని వెచ్చించి కృషిసల్పవలసి యుంటుంది.

## కృషి చేయాలి

సంతోషకరమైన జీవితానికి పనిచేయుట చాలా ముఖ్యము. ఏపని చేయకుండా సరదాగా కాలక్షేపము చేయువారు ఈ లోకములో మిక్కిలి దుఃఖపడువారుగా కన్పడుచున్నారు. బద్ధకస్తుని మనస్సు దయ్యానికి నిలయమై యున్నది. బద్ధకమనేది అసంతృప్తిని, జీవితములో చేదును మిగులుస్తుంది. అది ఒకని బాధలకు, కష్టాలకు గురిచేస్తుంది. మానవుడు పని చేయవలెనని దేవుని సంకల్పము. ఆయన ఆదామును, హవ్వను సృష్టించి ఏదేను వనములో పెట్టినపుడు ఆయన వారికి ఒక పనిని అప్పగించి యున్నాడు. ఆయన ఆ తోటను బాగుచేసి శుభ్రము చేయమని వారిని ఆదేశించెను. పనిలో నిమగ్నమగుటచేత కలిగే సంతోషము, సంతృప్తిని గురించి ఆయనకు తెలియును.

## ప్రేమించాలి

ప్రేమ విలువైన జీవితాన్ని యిస్తుంది, జీవితములో కలిగే

బాధలు ఒడుదుడుకులనుండి చేదును తొలగించివేస్తుంది. ప్రేమలేని జీవితము అర్ధములేని జీవితము. మొదటి కొరింధీయులకు వ్రాసిన పత్రిక 13వ అధ్యాయము చదివినట్లయితే ప్రేమకు గల అర్థము తెలుస్తుంది. ప్రేమ సంతోషాన్ని కలుగజేస్తుంది. ప్రతి ఒక్కరు ప్రేమింపబడవలె నని కోరతారు గానీ యితరులను ఎట్లు ప్రేమింపగలరు? ప్రేమింప బడటానికి బదులుగా ప్రేమించడం నేర్చుకొనవలెను. ప్రేమ వలన ఆనందము కలుగును.

పరులయందు ఆసక్తి కనబరచుము. అది జీవితాన్ని విలువైన దానిగా చేస్తుంది. ఈ లోకంలో "స్వార్థ చింతన" అనేది చాలా ఎక్కువ. మంచి సమరయుని కథ విన్న ఒక బాలుని ఆ కథలోని నీతిని గురించి అడిగినపుడు, అతడి సమాధానము ఈ విధముగా నున్నది. నేను ఆ కథద్వారా నేర్చుకొన్న నీతి యేమిటంటే "నేను కష్టాలలో ఉండినపుడు నా పొరుగువారు నాకు సహాయము చేయ వలెను". ఆ బాలుడు అర్థముచేసికొన్న రీతిలోనే మనముకూడ అర్థము చేసికొనుచున్నాము.

## ఇతరులయెడల ఆసక్తి కనబరచాలి

పరులయందు నిజముగ ఆసక్తి కనబరుచుము. "నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించు" అను దానిని నేర్చుకొనుము (మత్తయి 22:39). పొరుగువాని మంచిని కోరుము. అతడు అవసరములో నున్న పుడు ఆదుకొనుము. ఒకవేళ అతడు తప్పిపోయినట్లయితే క్రీస్తు నొద్దకు తోడ్కొని రమ్ము. "పుచ్చుకొనుటకంటె యిచ్చుట ధన్య మని" గుర్తుంచుకొనుము.

జీవితం విలువైనది. మనమందరమును, భిన్నమైన తలాంతు లను మరియు భిన్నమైన అర్హతలను కలిగి యున్నాము. ప్రకృతి

సిద్ధముగా మనకు కలుగని దానిని గురించి నిందించవద్దు. దానికి బదులుగా మనకు ఉన్నదానిని విశ్వాసము కలిగి ఉపయోగించుకొందాము. ఒక్క తలాంతు కలిగియున్నవాడు త్రోసివేయబడినాడు. దానికి కారణము అతని దగ్గర ఒక్క తలాంతు మాత్రమే ఉండుట వలన కాదుగాని అతడు దానిని ఉపయోగించనందువల్ల త్రోసివేయబడినాడు. మనకున్న తలాంతులను మన యోగ్యతను బట్టి ఉపయోగించవలెను. నీలో ఏదైన లోపము ఉండవచ్చును. దానిని అంగీకరించుటకు నేర్చుకొనుము. అదే విధముగా నీలో దాగియున్న యితర యోగ్యతలను ఉపయోగించుట నేర్చుకొనుము.

జీవించడానికి నిన్ను నీవు అనుమతించుకొనుము. నీయంతట నీవు మాత్రమే జీవించవలెను. నిన్ను నీవు అభిమానించుకొనే విధముగ జీవించుము. నిన్ను నీవు గౌరవించుకొనునప్పుడు, యితరులు నిన్ను గౌరవిస్తారు. నిజాయితి కలిగి జీవించుము. నీ మనస్సాక్షి నిన్ను గద్దింపనియ్యకుము. గద్దించే మనసాక్షి కలిగియుంటే అది సంతోషమును నాశనము చేయును, వ్యక్తిత్వాన్ని దెబ్బతీయును. ఆరోగ్యమును పాడు చేయును మరియు అది నీ నిద్రను పాడుచేయును.

దినమంతా జీవించుము. జీవించడానికి యిది ఒకటె మాత్రమే మార్గము. నిన్న అనునది గతము కావున నిన్న జీవించలేము. అదే విధముగా రేపు అన్నది భవిష్యత్ కావున రేపు జీవించలేము.

—రోయ్ బీస్లే.

---

## లోక జ్యోతులు

మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య నిరపరాధులు నిష్కళంకులు అనింద్యులైన దేవుని కుమారులయ్యేటట్లు సణుగులు సంశయాలు మాని సమస్త కార్యాలు చెయ్యండి. అలాంటి జనము మధ్య

మీరు జీవవాక్యాన్ని చేత పట్టుకొని లోకంలో జ్యోతులలాగ కనబడుతున్నారు. ఇందువల్ల నేను వ్యర్థంగా పరుగెత్తలేదని, నేను పడిన కష్టం నిష్ప్రయోజనము కాలేదని క్రీస్తు రోజున నాకు అతిశయ కారణం వుంటుంది అన్నాడు అపొస్తలుడైన పౌలు (ఫిలిప్పీ 2:14-16). అంటె మీరు అక్రమస్తులైన వక్ర వ్యక్తుల మధ్య వున్నారు. మీరు నిరపరాధులు, నిష్కళంకులు, నిందారహితులునునైన దైవకుమారులు అని ఋజువు చేయుండి. ఆ వక్రబుద్ధుల మధ్యలో మీరు జీవవాక్యమును గట్టిగా చేత పట్టుకొని జ్యోతులలాగ కనబడుతున్నారు. మీరు అలా చేస్తే నేను వ్యర్థంగా కృషి చేయలేదని నిష్ఫలంగా ప్రయాస పడలేదని క్రీస్తు వచ్చే రోజున ఉత్సాహపడడానికి నాకు కారణం.

సోదరీ సోదరులారా! దేవుడి ప్రత్యక్షం నాడు నేడు ఒక్కటే ఇందులో ఏ మాత్రము మార్పులేదు. క్రైస్తవ విశ్వాస ప్రమాణాలు ఎప్పుడు ఉన్నతమైనవే. దేవుడికి సన్నిహితంగా జీవిస్తూ, క్రీస్తును పోలి పవిత్ర జీవితమును గడపాల్సినవారు విశ్వాసులు. ఇదే అక్కరను పురస్కరించుకొని పౌలు ఫిలిప్పీ సంఘస్తులకు ఈ ఉత్తరం వ్రాసాడు.

పౌలు చెపుతున్న మాటలు ఏమిటంటె. మీరు సమస్త మంచి కార్యములు చెయ్యండి. మీ కార్యకలాపాలు కొనసాగాలి. ఆలోచనలు భావాలు వుంటె చాలదు. పనిచేయాలి దేవునికోసం. పగలున్నంత వరకు పనిచెయ్యాలి. సణగకండి దేవుడి చిత్తం విషయంలో సణుగు వుండకూడదు. క్రీస్తును ఎరుగనివారు భగ్నజీవులై విషాద గీతం పాడి దేవుని నిందించినవారున్నారు. ఎంత క్రూరుడివయ్యా దేవా! నా పసి కందును తీసుకున్నావు. నా భార్యను తీసుకున్నావు అంటూ నిష్ఠుర శ్లోకాలు వల్లిస్తారు. కాని క్రీస్తు ప్రజలు సణగరు. దేవుశి విషయంలోనే కాదు మనుష్యుల విషయంలో కూడా సణగకూడదు. వారికి నా కరిటె సమృద్ధివుందే యని గాని అతడికి నాకంటె తెలివితేట

లున్నాయని సణగడం ఆధ్యాత్మిక నేరం. సోదరుని సన్మానించడానికి
బదులు అతడి సౌశీల్యాన్ని పరోక్షంగా హత్య చేయబూనడం నీచం.
లోకం ఇలా భ్రష్టమైపోతుందే యని కూడా సణగకండి. అన్యాయాన్ని
సహించాలి. ఫిర్యాదులు తోరణాలుగా మెడకు వేసుకొని తిరగకండి.
మౌనంగా ప్రశాంతగా అనుభవించాలి. మీ సహనం మిమ్మను పై
అంతస్తుకు ఎత్తుతుంది. యేసుక్రీస్తు తనను హింసించేవారిని పల్లెత్తు
మాట కూడా అనలేదు. వివాదాలు పెట్టుకోకండి. దేవుడితో గాని
తోటివారితో గాని వివాదాలు పడవద్దు.

అనవసరంగా కలహాలు తెచ్చుకోవద్దు. క్రీస్తుని ఎరుగని వేదాం
తులు, వాదోపవాదాలలో సంఘర్షణలలో పడిపోవడం పరిపాటి.
క్రీస్తు ప్రజలు క్రీస్తు తమకు ఇది చేసాడు అది మాత్రము తమ అను
భవములోనికి పంచుకుంటారు. క్రైస్తవ ప్రజలు నిష్కళంకులు నిరప
రాధులు అనింద్యులుగా బ్రతకాలి. దానియేలు విషయం ధ్యానిం
చండి. శత్రువులకు కూడా అతనిలో కళంక మేమి కనిపించలేదు. అతడు
క్రైస్తవుడు అందుకని అతడు మాకు ఇష్టంలేదు కాని అతడు నిప్పు
లాంటి మనిషి. అతడిలో ఏదోషము లేదు. అని లోకం నిన్ను గురించి
చెప్పగలగాలి. క్రీస్తు ప్రజలు నిరపరాధులుగా బ్రతకాలి. ఇతరులకు
హానిచేయని అనింద్యులు. వారు గొర్రెలలాంటివారు. పొడవటానికి
కొమ్ములు లేవు కాటువేయటానికి కోరలు లేవు. వారు పాపులలోనుంచి
ప్రత్యేకంగా వున్నవారు. ఎందుకంటే వారు క్రీస్తునుబట్టి దేవుని కుమా
రులు కుమార్తెలు. వారి కన్నులు పరిశుద్ధరాజును యేసునే చూస్తాయి.
వారి పాదాలు ఉత్తమమైన వాటిని గురించిన శుభవార్తను ప్రకటించ
డానికి పరుగెడతాయి. క్రైస్తవులు దేవుని కుమారులు. ఎవరు మీ
మీద నింద మోపలేరు. మిమ్మల్ని నిందించాలంటే అబద్ధం

చెప్పి అపనిందలు ప్రచారం చేయాల్సిందే. మీరు అక్రమస్తులైన వక్రబద్ధాలమధ్య వున్నారు.

ఎందుకు క్రీస్తు ప్రజలు ఇలా బ్రతకాలి? మీరు లోకంలో జ్యోతులుగ ప్రకాశించాలి. ఇదే మీ ధ్యేయం. జీవవాక్యం మీ చేతులలో వుండాలి. లోకంలో చీకటి దట్టంగా అలుముకొని వుంది. విశ్వాసి ఈ చీకటిమధ్య ప్రకాశించాలి. ఈ లోకాంధకారం చేత ప్రభావితులైనవారికి క్రైస్తవ జ్యోతి వెలుగు చూపాలి. గమనించాలి. క్రైస్తవుడు వెలుగురిలో నిస్పష్టంగా ప్రకాశించాలి. క్రైస్తవులవల్ల లోకానికి ప్రయోజనం కలగాలి. విశ్వాసులు లోకంలోనే వుండాలి. కాని లోకసంబంధులు కాకూడదు. మీరు ఇలా ప్రవర్తిస్తే క్రీస్తు రాకడ సమయంలో గొప్ప ఆశీర్వాదం. విశ్వాసులు జ్యోతులు వెలుగును దాచలేము. జ్యోతి ప్రకాశిస్తుంది. రహస్య ప్రకాశం వల్ల ఏమీ లాభంలేదు. అయితే వారెక్కడ ప్రకాశించాలి. ఇంట్లో మాత్రమేనా కాదా లోకంలో క్రైస్తవుడి విశ్వాసం పరిపక్వమైతే లోకంలో ప్రకాశిస్తుంది. వారు జ్యోతులు. ప్రకాశించే జ్యోతులు లోకంలో ప్రకాశించే జ్యోతులేవారు క్రైస్తవుడి వునికి వెలుగురికి తెలియాలి. రహస్య విశ్వాసం చివరికి అవిశ్వాసం క్రిందకి దిగజారుస్తుంది. సోదరుడా, సోదరి నీవు క్రీస్తును విశ్వసించిన పక్షంలో నీ సాక్ష్యం బహిరంగంగా అందరు చూచేలా వుంచి వెలుగును దాచిపెట్టకు, వెలుగును నిన్ను చూచి మెచ్చుకోవాలి యని కాదు నీ సహజ జీవన విధానం వెలుగులాగా ఇతర జీవితాలపై ప్రకాశించాలి.

—S.J. బెన్‌హర్, రాజమండ్రి.

# పది ఆజ్ఞలు

## ( The Ten Commandments )

పాత నిబంధనలోని పది యాజ్ఞలను ఇంచుమించు మన మంద రము వినియే యుందుము. ఆ పది ఆజ్ఞలను అందరు వల్లించలేకపో వచ్చును గాని వాటిని గూర్చి విననివారు సాధారణంగా ఉండరు. ఇశ్రాయేలీయులు ఐగుపు బానిసత్వమునుండి బయలుదేరిన మూడవ నెల ఆరంభ దినమందే వారు సీనాయి అరణ్యమునకు వచ్చారు (నిర్గమ 19:1). వారు సీనాయి పర్వతము ఎదుట బస చేసారు. మోషే దేవుని యొద్దకు ఎక్కి పోవగా దేవుడు వారిని ఐగుపునుండి ఎట్లు విడిపించెనో అతనికి జ్ఞాపకము చేసాడు. "కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడచిన యెడల మీరు సమస్త దేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు. మీరు నాకు యాజకరూపమైన రాజ్యముగాను, పరిశుద్ధ జనముగాను ఉందురని" ఇశ్రాయేలీయులతో పలుకవలెనని ఆయన చెప్పాడు. మోషే వచ్చి ప్రజల పెద్దలను పిలి పించి యెహోవా తన కాజ్ఞాపించిన ఆ మాట లన్నియు వారి యెదుట తెలియపరచాడు. అందుకు ప్రజలందరు యెహోవా చెప్పిన దంతయు చేసెదమని ఏకముగా ఉత్తరమిచ్చారు (నిర్గ 19.3-7).

మోషే ప్రజల మాటలను దేవునితో చెప్పాడు. అందుకు దేవుడు ప్రజలు తమ్మును తాము పరిశుద్ధపరచుకొని, తమ బట్టలు ఉతుకుకొని మూడవనాటికి సిద్ధముగా యుండాలని చెప్పాడు. ఏలయనగా మూడవనాడు యెహోవా ప్రజలందరి కన్నుల ఎదుట సీనాయి పర్వ తముమీదికి దిగి వచ్చును. ప్రజలు మోషే మాటలు విని నడుచు కొనునట్లు వారు దేవుని స్వరము వినాలని దేవుడు కోరాడు. ప్రజలు పర్వతమును ముట్టకుండునట్లు మేరను ఏర్పరచి ఆ పర్వతమును ముట్టు ప్రతి వానికి మరణ శిక్ష తప్పక విధింపబడునని ఆయన చెప్పాడు.

మూడవనాడు వాగ్దానము చేసినట్లే యెహోవా అగ్నితో సీనాయి పర్వతముమీదికి దిగి వచ్చెను; పర్వతమంతయు మిక్కిలి కంపించెను. ఆ పర్వతముమీద ఉరుములు మెరుపులు సాంద్ర మేఘము బూరయొక్క మహాధ్వని కలుగగా ప్రజలందరు వణకిరి. యెహోవా పర్వత శిఖరము మీదకి రమ్మని మోషేను పిలిచి ప్రజలు హద్దుమీరి రాకుండునట్లు వారిని మరల హెచ్చరించు మనెను. యెహోవా యొద్దకు చేరు యాజకులు కూడ తమ్మును తామే పరిశుద్ధ పరచుకొనవలెనని ఆయన చెప్పాడు. నీవు దిగి వెళ్ళుము, నీవును నీతో అహరోనును దిగి రావలెనని ఆయన మోషేకు చెప్పాడు. అట్లు జరిగిన తరువాత దేవుడు ఈ ఆజ్ఞలన్నియు వివరించి చెప్పాడు:

## దే వు డి ఆ జ్ఞ లు

"నీ దేవుడైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తు దేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని; నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. పైన ఆకాశమందే గాని క్రింది భూమియందే గాని భూమిక్రింద నీళ్ళయందే గాని యుండు దేని రూపము నయినను విగ్రహము నయినను నీవు చేసికొనకూడదు; వాటికి సాగిలపడకూడదు. వాటిని పూజింప కూడదు. ఏలయనగా నీ దేవుడైన యెహోవానగు నేను రోషముగల దేవుడను; నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరములవరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించుచు నన్ను ప్రేమించి నా ఆజ్ఞలను గైకొను వారిని వెయ్యి తరములవరకు కరుణించువాడనై యున్నాను.

"నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింప కూడదు. యెహోవా తన నామమును వ్యర్థముగా నుచ్చరించు వానిని నిర్దోషిగా ఎంచడు."

"విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపక

ముంచుకొనుము. ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయ వలెను, ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతి దినము. దానిలో నీవైనను నీ కుమారుడైనను నీ కుమార్తెయైనను నీ దాసుడైనను నీ దాసియైనను ఏ పనియు చేయకూడదు. ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి యేడవ దినమున విశ్రమించెను. అందుచేత యెహోవా విశ్రాంతి దినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధపరచెను."

"నీ దేవుడైన యెహోవా నీ కనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడ వగునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానింపుము. నరహత్య చేయకూడదు. వ్యభిచరించకూడదు. దొంగిల కూడదు. నీ పొరుగువానిమీద అబద్ధ సాక్ష్యము పలుక కూడదు. నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు. నీ పొరుగువాని భార్యనైనను అతని దాసునైనను అతని దాసినైనను అతని యెద్దునైనను అతని గాడిదనైనను, నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు" (నిర్గమ 20:1-17).

## వ్రేజల తిరుగుబాటు

నిర్గమ కాండము 24వ అధ్యాయములో దేవుడు మోషేను మరల కొండపైకి పిలిచాడు. "నీవును అహరోనును నాదాబును అబీహును ఇశ్రాయేలీయుల పెద్దలలో డెబ్బది మందియు యెహోవా యొద్దకు ఎక్కివచ్చి దూరమున సాగిలపడుడి" యని ఆయన చెప్పాడు (నిర్గ 24:1). "అప్పుడు యెహోవా మోషేతో ఇట్లనెను - నీవు కొండ యెక్కి నా యొద్దకు వచ్చి అచ్చట నుండుము; నీవు వారికి బోధించునట్లు నేను వ్రాసిన ఆజ్ఞలను ధర్మశాస్త్రమును రాతి పలకలను నీకిచ్చెదననగా మోషే దేవుని కొండమీదికి ఎక్కెను" (నిర్గమ 24:12). "అప్పుడు మోషే ఆ మేఘములో ప్రవేశించి కొండమీదికి ఎక్కెను. మోషే ఆ కొండమీద రేయింబవళ్ళు నలువది దినము

లుండెను" అని 18వ వచనములో వ్రాయబడి యున్నది. నిర్గమ 25వ అధ్యాయమునుండి 31వ అధ్యాయము వరకు, దేవుడు మోషేకు మిగిలిన ఆజ్ఞలు విధులన్నియు వివరముగా చెప్పాడు.

నిర్గమ కాండము 32వ అధ్యాయములో ఇశ్రాయేలీయులు బలవంతము చేయగా అహరోను ఒక బంగారు దూడను చేయించినట్లు ఆ దూడయే తమ్మును బానిసత్వమునుండి విడుదలచేయించిన దేవత యని వారు పూజించుచున్నట్లు చూడగలము. కొండదిగువను యేమి జరుగుచున్నదో యెహోవా మోషేకు చెప్పాడు. వారు చేసిన పాపమునుబట్టి దేవుడు వారిని కాల్చివేసి మోషేను గొప్ప జనముగా చేసెదనని చెప్పాడు. ఇశ్రాయేలీయుల దరపున మోషే బ్రతిమలాడగా దేవుడు తన ప్రజలకు చేసెదనని చెప్పిన కీడును గూర్చి సంతాపబడెను.

## దేవుని చేవ్రాత

"మోషే శాసనములు గల రెండు పలకలను చేతపట్టుకొని కొండ దిగివచ్చెను. ఆ పలకలు ఇరుప్రక్కలను వ్రాయబడినవి. అవి ఈ ప్రక్కను ఆ ప్రక్కను వ్రాయబడియుండెను. ఆ పలకలు దేవుడు చేసినపని. ఆ పలకమీద చెక్కబడిన వ్రాత దేవుని చేవ్రాత" (నిర్గ 32:15, 16). అతడు పాళెము సమీపంగా ఆ దూడను, వారు నాట్యమాడుటకు చూచి అతని కోపము మండెను. అతడు కొండ దిగువను తన చేతులతో ఆ పలకలను పడవేసి వాటిని పగులగొట్టెను (నిర్గ 32:19).

దేవుడు మోషేకు మరియొకసారి రెండు రాతిపలకల నిచ్చాడు. నిర్గమ 34:1లో యెహోవా మోషేతో "మొదటి పలకలవంటి మరి రెండు రాతి పలకలను చెక్కుము. నీవు పగులగొట్టిన మొదటి పలకల మీదనున్న వాక్యములను నేను ఈ పలకలమీద వ్రాసెదనని చెప్పాడు." "అతడు నలువది రేయింబవళ్ళు యెహోవాతోకూడ అక్కడ ఉండెను......అంతలో ఆయన ఆ నిబంధన వాక్యములను అనగా పది ఆజ్ఞలను ఆ పలకలమీద వ్రాసెను" (నిర్గ 34:28).

గనుక ఈ రీతిగా ఈ పది ఆజ్ఞలను దేవుడు మొదట నోటితోనే చెప్పాడు. తరువాత వాటిని రెండు రాతి పలకలమీద చెక్కాడు. అవి పగులగొట్టబడగా మరి రెండు రాతి పలకలమీద ఆయన వాటిని వ్రాసి యిచ్చాడని గ్రహించుకోగలము. దేవునిచే వ్రాయబడిన ఆజ్ఞలు గనుక ఈ పది యాజ్ఞలు ఇశ్రాయేలు దేశములో గొప్ప ప్రాముఖ్యత వహించాయి. నేటి మానవుని నైతిక వర్తనము కూడ చాలమట్టుకు ఈ పది యాజ్ఞల మీదనే ఆధారపడి యున్నది.

## పది యాజ్ఞల సారాంశము

యేసు ప్రభువు ఈ లోకానికి వచ్చి వాటిలో నిగూఢమైన భావాలను వెలితీసి మానవులకు బోధించాడు. దైవిక జ్ఞానాన్ని బట్టి పది యాజ్ఞలన్నిటి సారాంశాన్ని ఆయన ఇట్లు క్రోడీకరించాడు: ధర్మ శాస్త్రములో ముఖ్యమైన ఆజ్ఞ నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ హృదయముతోను నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెను. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ, నిన్ను వలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు, దాని వంటిదే (మత్త 22:37-39).

కొత్త నిబంధనలో మానవుడు నూతన జీవితం జీవించే మార్గాన్ని యేసుప్రభువు బయలుపరచాడు. ఆయన శాసనము రాతి పలకలమీద గాక మాంసపు గుండెమీద వ్రాయబడాలి (యిర్మి 31:31-34). ఈ పది యాజ్ఞల వెనుకయున్న గొప్ప ఆత్మీయ సూత్రాలు కొత్తనిబంధనలో ఎంత లోతుగా బలంగా యున్నాయో వచ్చే మా సంచికలలో తెలిసికొందాము.

—జాషువా గూటం

# సింహముల బోనులో దానియేలు

బబులోనులోని దుర్మార్గులు దైవసేవకుడైన దానియేలును చంపాలని ఎన్నో కుతంత్రాలు పన్నారు. ఎవరైనను రాజైన దర్యావేషును తప్ప మరే దేవునివద్దనైనా ఏమనుష్యుని వద్దనైనా ప్రార్థిస్తే క్రూర సింహములున్న బోనులో వేసి యుంచాలని ఒక తాఖీదు మీద రాజు సంతకము చేయించినారు.

ఆ తాఖీదును లక్ష్యపెట్టని దానియేలు, రోజు మూడుసార్లు ప్రార్థన చేస్తాడు. రాజాజ్ఞ ప్రకారము అతడ్ని సింహాల బోనులో బందిఖానలో వుంచారు. అయితే దానియేలు భయపడక తన దేవుని యందు భయము భక్తి గలవాడైనందున అతనికి ఏ హానియు కలుగలేదు. దానియేలు 6వ అధ్యాయము పూర్తిగా చదవండి.

సండేస్కూలులో యీ కథ విన్ననా మనమరాళ్ళతో దానియేలు భక్తుడు వాటి బారినుండి ఏలా తప్పించుకొన్నాడు అని వారి నాయనమ్మ అడిగింది. దానికి ఆ బాలికలు యిద్దరు యేకమ్మడిగా గద్గదస్వరముతో ఆ బోనులో ఆ సింహముతో పాటు మరొక సింహము వున్నది. రాజునకు తెలియని ఆ సింహము, యూదాగోత్రపు సింహము (ప్రకటన 5:5). ఆ సింహము దానియేలును రక్షించినదని చెప్పారు.

అయితే ప్రియమైన విశ్వాసీ ఆ మరో సింహము యీరోజులో క్రీస్తునందు జనించిన బిడ్డలందరిని రక్షించుటకు, మన ఆపదలందు కష్టములందు, తోడ్పడుటకు సిద్ధముగా వున్నాడు. ఆయన యందు విశ్వాసముంచండి. దేవుడు మన పక్షమున వుండగా మనకు విరోధి యెవరు? ఖైదీయనువాడు ప్రభుత్వానికి పెంపుడు కొడుకుగానైతాను బిడ్డగా వుంటాడు. మూర్ఖుడు చీకటిలాంటివాడు. విశ్వాసి కత్తి చూపి భయపెట్టిన, కర్రచూపి భయపెట్టిన భయము చెందడు. ఆ చీకటిలాంటి

మూర్ఖుడు సత్యమునకు వెలుగుకు మాత్రమే భయపడును. గనుక విద్యార్థులారా చిన్నబిడ్డలవలెనుండి వెలుగును పొంది వినయంగా వుండి జరిపినులు చేయక మౌనముగా వుండండి గాని మూర్ఖవాని వలె వుండకుడి.

పదేపదే కోపము చేయువాడు మనిషి కాదు. పదేపదే కోపం తెప్పించేవాడు పశువుకూడ కాదు. సుజన బంధుమాటలు సాధుసజ్జన సహవాసపు మాటలనే నమ్మి క్రీస్తు సంఘసభ్యులై రక్షణ పొందండి.

—P. భూషణం, శిరిపురం.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
SATYA WAKKU
P.O. Box. 80
KAKINADA–533 001

No.

To
..............................
..............................
..............................
..............................